శివారులో కొనసాగుతున్న వెతలు

- సాగునీరు అందక బీటలు వారిన వరిచేలు
- పలుచోట్ల ఎండిపోతున్న పంటలు
- అన్నదాతల ఆక్రందన
- పట్టించుకోని అధికార యంత్రాంగం



పల్లంకుర్రు పరిధిలో సాగునీరు అందక పంటచేలు బీటలు వారడంతో మోటారు సైకిల్‌పై నిరసన తెలుపుతున్న రైతు (ఫైల్)



పల్లంకుర్రు శివారు రామాలయంపేటలో సాగునీరు అందక ఎండిపోయిన పంటచేలు

కాట్రేనికోన: సాగునీరు అందక శివారు ప్రాంతాల్లో పంటచేలు బీటలు వారి పోతున్నాయి. సాగునీటి ఎద్దడి నుంచి పంటను రక్షించుకునేందుకు రైతులు రాత్రి, పగలు తేడా లేకుండా చెమటోడ్చుతున్నారు. పల్లంకుర్రు శివారు దాసరివారిపేటలో ఎండిన చేలలో మోటారుసైకిలు నడిపి ఓ రైతు వినూత్న నిరసన తెలిపాడు. మండల పరిధిలో సుమారు 8,100 ఎకరాలకు గానూ 7,300 ఎకరాలల్లో వరినాట్లు వేశారు. బొబ్బర్లంక–పల్లంకుర్రు ప్రధాన పంట కాలువ ద్వారా కుండలేశ్వరం వైరులాకు దిగువ, ఎగువ ప్రాంతాల రైతులకు సాగునీటిని వంతుల వారీగా ఇరిగేషన్ అధికారులు సరఫరా చేస్తున్నారు. వంతుల వారీ పద్ధతిలో సాగునీరు అందిస్తున్నా శివారు ప్రాంత పంట చేలకు నీరు అందక బీటలు వారిపోతున్నాయి. మండలంలోని పల్లంకుర్రు నెంబరు 2 లాకు నుంచి బలుసుతిప్ప వెళ్లే కాలువ వెంబడి ఉన్న మొక్కలతిప్ప, బూలవారిమొండి, రామాలయంపేట, దాసరివారిపేట, సాపేవారిపేటలో సాగునీరు అందక పంటచేలు ఎండి బీటలు వారింది. సుమారు 200 ఎకరాల్లో వరిచేను ఎండిపోవడంతో తీవ్రనష్టం వాటిల్లింది. పల్లంకుర్రు నెంబరు 1 కాలువ వెంబడి చింతలచెరువు, లైనుపేట, కొత్త కాలువ మీదుగా ఐ.చెరువు వెళ్లే పంట చేలకు సాగునీటి ఎద్దడి అధికంగా ఉంది. కందికుప్ప పంట కాలువ వెంబడి శివారు ప్రాంత రైతులకు చుక్కనీరు అందడం లేదు. పంట కాలువలో సాగునీరు లేకపోవడంతో రైతులు కాలువకు అడ్డుకట్టలు వేసుకుని రాత్రి, పగలు తేడా లేకుండా కష్టపడి నీరు పెట్టుకుని పంటను రక్షించుకుంటున్నారు.

పల్లంకుర్రు శివారు దాసరివారిపేట, రామాలయంపేట, గొల్లగరువు ప్రాంతాలలో సాగునీరు అందక పంటచేలు బీటలు వారి ఎండిపోతోంది. పల్లంకుర్రు, కందికుప్ప, గెద్దనపల్లి, దొంతికుర్రు, బక్కివారిపేట, వెంకమ్మ చెరువు, కాట్రేనికోన, రేవువారిపేటకు వెళ్లే రోడ్డు వెంబడి భూములకు సాగునీటి ఎద్దడి అధికంగా ఉంది. శివారు భూములు కావడంతో సాగునీరు అందక పంటను రక్షించుకొనేందుకు రైతులకు ఇంజిన్లు దిక్కుగా మారింది. పల్లంకుర్రు ప్రధాన పంట కాలువలో ఇంజిన్లు పెట్టుకుని సాగునీరు తోడుకుంటున్నారు. అదనపు భారం అయినప్పటికీ ఇంజిన్లతో నీటిని తోడుకోవడం తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన వద్దు

పల్లంకుర్రు శివారు భూములకు సాగునీటి ఎద్దడి ఉన్న మాట వాస్తవమే. వంతుల వారీగా 11 రోజులకు ఓసారి చొప్పున 4 రోజుల పాటు కుండలేశ్వరం లాకు దిగువ ప్రాంతాలకు సాగునీరు అందిస్తున్నాం. సాగునీటి విషయంలో రైతులు ఆందోళన చెందవద్దు.

పవన్ కుమార్, ఏఈఈ, ఇరిగేషన్ శాఖ.

క్లుప్తంగా

ఉపాధ్యాయిని దాతృత్వం



యాచకులకు అన్నదానం చేస్తున్న ఉపాధ్యాయిని సుజాత

అమలాపురం టౌన్: స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేస్తున్న జీవీఎస్ సుజాత పట్టణంలోని రోడ్ల చెంత ఉండే అనాథలు, యాచకులకు గురువారం మధ్యాహ్నం అన్న, వస్త్రదానం చేశారు. అనాథలు, యాచకుల వద్దకు ఆమె స్వయంగా వెళ్లి భోజనం పెట్టి ఆకలి తీర్చారు. అనంతరం వస్త్రదానం చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా అనాథలు, యాచకులకు అన్న, వస్త్రదానం చేశారు.

కైట్ ప్రిన్సిపాల్ రేవతికి డాక్టరేట్



మలేషియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకుంటున్న కైట్ కళాశాల ప్రిన్సిపాల్ రేవతి

తాళ్లరేవు: కైట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రేవతి దూబేకు మలేషియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. పునరుత్పాదక ఇంధనం, స్మార్ట్ గ్రిడ్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కంట్రోల్ ఇంటెలిజెంట్ గ్రిడ్ సిస్టమ్‌లను అభివృద్ధి చేయడంపై ఆమె చేసిన పరిశోధనకు గానూ లింకన్ విశ్వవిద్యాలయం నుంచి ఇంజినీరింగ్‌లో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీని అందుకున్నారు. తాను ఈ డాక్టరేట్ సాధించేందుకు సహకరించిన కైట్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ప్రతినిధులకు రేవతి కృతజ్ఞతలు తెలిపారు.

యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

ముమ్మిడివరం: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జర్మనీ భాష నేర్పించడంతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరిశేషు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 25లోపు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. మెక్ట్రోనిక్స్, ఎలక్ట్రికల్, ఎనర్జీ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ లేదా డిప్లొమా పూర్తి చేసి ఉండాన్నారు. 18 నుంచి 40 ఏళ్ల వయస్సు కల్గి కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలన్నారు. ఆరు నెలలు శిక్షణ పొందిన అనంతరం రెండేళ్లు జర్మనీలో పని చేయాల్సి ఉంటుందన్నారు. భారత కరెన్సీ ప్రకారం నెలకు రూ.2.5 లక్షల నుంచి రూ.3.24 లక్షల వరకు జీతం ఉంటుందన్నారు. ఈ నెల 25లోపు ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పది విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ



విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేస్తున్న దాతలు

తాళ్లరేవు: పి.మల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు శుక్రవారం పరీక్షల కిట్లు అందజేశారు. తాతగారి కుటుంబం వాట్సాప్ గ్రూప్‌కు చెందిన సభ్యుల సహకారంతో కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, విశ్రాంత బ్యాంకు మేనేజర్ సూర్యనారాయణమూర్తి, ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి బాబి, బల్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రేపటి వరకూ గ్లకోమా వారోత్సవాలు

అమలాపురం రూరల్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రోగ్రాం మేనేజర్ హేమలత గురువారం తెలిపారు. 35 నుండి 40 ఏళ్ల మధ్య వయస్సు గలవారు ఈ పరీక్ష చేయించుకోవాలని ఆమె సూచించారు. అమలాపురం ఏరియా ఆసుపత్రితో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఐ.పోలవరం: మండల పరిధిలో నూతనంగా నిర్మించుచున్న 11 కేవీ లైను నిర్మాణ పనుల నిమిత్తం శుక్రవారం మండల పరిధిలో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అమలాపురం ఈఈ రాంబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐ.పోలవరం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్, 11 కేవీ గుత్తినదీవి ఫీడర్ పరిధిలో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. 33కేవీ గుత్తినదీవి లైన్ ట్రీ కటింగ్, మరమ్మతుల నిమిత్తం పాత ఇంజరం, ఎదురులంక, గుత్తినదీవి, గొగుల్లంక, జి.వేమవరం, జి.మూలపాలెం, ఎర్రగరువు, చిన్నకొడప గ్రామాలు, దుప్పలంక ఏటిగట్టు ఆక్వా చెరువులు, జి.వేమవరం ఏటిగట్టు ఆక్వా చెరువులకు సైతం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఈఈ తెలిపారు.

కిడ్నీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

అమలాపురం టౌన్: ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నిర్వహిస్తున్న అపోలో కిడ్నీ డయాలిసిస్ యూనిట్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ జరిగింది. ర్యాలీ ముందు ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ శంకరరావు, డయాలిసిస్ యూనిట్ సెంటర్ ఇన్‌చార్జి విప్పర్తి దుర్గాప్రసాద్ తదితర వైద్యులు, యూనిట్ సిబ్బంది సమక్షంలో కిడ్నీ దినోత్సవాన్ని నిర్వహించారు. అమలాపురం ఏరియా ఆస్పత్రిలో ఒకేసారి పది మంది కిడ్నీ రోగులకు డయాలిసిస్ చేసే యూనిట్ల సామర్థ్యం ఉందని, వాటిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆ యూనిట్ ఇన్‌చార్జి విప్పర్తి దుర్గా ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆస్పత్రి ఆవరణ నుంచి స్థానిక నల్ల వంతెన వరకూ వైద్యులు, వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. డయాలిసిస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాహిల్, అపోలో డయాలిసిస్ క్లినిక్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధాకరరావు, మేనేజర్ మధు కిరణ్ వంటిపల్లి, డాక్టర్ రతన్ బెనర్జీ, డాక్టర్ జోషఫ్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా స్థానిక చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనంలో వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో గురవారం సాయంత్రం ఆరోగ్య సదస్సు జరిగింది. వాకర్స్ ప్రతినిధులు డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి, డాక్టర్ బి.రాఘవేంద్రరావులు సదస్సులో కిడ్నీలు ఆరోగ్యంగా ఉండేలా సంరక్షించుకునే విధానాలను వాకర్స్‌కు వివరించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, క్లబ్ కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, కోశాధికారి వలవల నాయుడు, వాకర్స్ ప్రతినిధులు కుడుపూడి త్రినాథ్, పుత్సా కృష్ణ కామేశ్వర్, నూకల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై కొరడా

- నరకు సీజ్, జరిమానా వసూలు
- పలు దుకాణ సముదాయాల్లో అవగాహన



అమలాపురంలోని ఓ వైన్ షాపులో ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేస్తున్న బృందం

అమలాపురం టౌన్: పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ వస్తువులపై అధికారులు కొరడా ఝుళిపించారు. అమలాపురం పట్టణం మెయిన్ రోడ్డులోని కలశం సెంటరులో పలు దుకాణాలపై వార్డు సచివాలయ కార్యదర్శులు గురువారం సాయంత్రం ఆకస్మిక దాడులు చేసి, ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై చర్యలు చేపట్టారు. కలశం సెంటరులో జేఎస్ వైన్స్ మార్ట్‌లో పాలథీన్ కవర్లు అధికంగా వాడుతున్నట్టు వార్డు కార్యదర్శుల బృందం గుర్తించింది. ఆ వైన్ షాపులోని సింగల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేసి, షాపు యాజమానికి రూ.5 వేల జరిమానా విధించారు. ఈ ఆకస్మిక దాడులను వార్డు సచివాలయాల శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు బండి వీరన్న, కాండ్రేగుల వెంకట ఈశ్వరరావు, వంకాయల సతీష్, కుమారస్వామి, బి.దుర్గ, కె.సీతామహాలక్ష్మితో కూడిన బృందం నిర్వహించింది. పట్టణంలోని అనేక దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై హెచ్చరికలు చేశారు. ఇదే బృందం స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ సమీపంలోని రైతు బజార్, గడియారం స్తంభం సెంటరు సమీపంలోని సర్క్యులర్ బజార్ వద్ద రైతులకు, వినియోగదారులకు ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల స్థానే వస్త్ర, నార సంచులు వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వస్తువులతో సరకులు ఇవ్వడం లేదా అమ్మడం నిషిద్ధమని స్పష్టం చేశారు. వాటిని సమూలంగా నిరోధించి, పర్యావరణ పరిరక్షణకు వ్యాపారులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

పది పరీక్షల నిర్వహణలో అలసత్వం వద్దు

డీఈఓ షేక్ సలీం బాషా



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో షేక్ సలీం బాషా

ముమ్మిడివరం: పది పరీక్షలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా పిలుపునిచ్చారు. మండలంలోని ముమ్మిడివరం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గురువారం పలు ఉపాధ్యాయ సంఘాలతో ఆయన సమావేశం నిర్వహించారు. యూనియన్ నాయకులను ఉద్దేశించి డీఈవో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలను ఉపాధ్యాయుల సహకారంతో సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం కృషి చేస్తున్నామన్నారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పరీక్షలను నిర్వహించడం ద్వారా జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పరీక్షల విభాగం ఏసీ హనుమంతరావు మాట్లాడుతూ ఈనెల 17నుంచి జరిగే పది పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. డీవైఈవోలు సూర్యప్రకాష్, రామలక్ష్మణమూర్తి, పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు నక్కా సురేష్, నాగేశ్వరరావు, సమగ్ర శిక్షా ఎఫ్ఏఓ ప్రవీణ్‌కుమార్, రాంబాబు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ శిక్షణ పోస్టర్లను ఆవిష్కరించిన ఎస్పీ



శిక్షణా తరగతుల ప్రారంభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ కృష్ణారావు తదితరులు

అమలాపురం టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం బీబీసీ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణా తరగతుల ప్రారంభ పోస్టర్లను జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు స్థానిక ఎస్పీ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలకు శిక్షణ కోసం అభ్యర్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా అమలాపురంలో అందుబాటులోకి వచ్చిన బీబీసీ ఇన్‌స్టిట్యూట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీబీసీ ఇన్‌స్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ రత్నప్రసాద్ మాట్లాడుతూ అమలాపురం బుద్ధవిహార్ మొదటి అంతస్తులో ఈ నెల 15 నుంచి ఆర్‌ఆర్‌బీ గ్రూప్–డి, ఏప్రిల్ 1 నుంచి బ్యాంకింగ్ సెక్టారు ఉద్యోగ శిక్షణకు బ్యాచ్‌లు ప్రారంభమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాస్, బీబీసీ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ ఫ్యాకల్టీ, అభ్యర్థులు పాల్గొన్నారు.

కలెక్టర్, జేసీకి వీఆర్వోల సంఘం వినతి



కలెక్టర్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ దివాకర్, వీఆర్ఓల సంఘం నాయకులు

అమలాపురం రూరల్: ఒక సచివాలయానికి ఒకే వీఆర్‌ఓ ఉండేవిధంగా నిర్ణయం తీసుకోవాలని, వీఆర్‌ఓ కేడర్ సంఖ్య తగ్గకుండా చూడాలని కోనసీమ జిల్లా వీఆర్‌ఓల సంఘం కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కోరింది. కోనసీమ జిల్లా కమిటీ తరుపున కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నిషాంతిని గురువారం కలిసి గ్రామ రెవెన్యూ అధికారులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారుల డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాధనాల ఎల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అల్లాడి మల్లేష్, సహ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకట గణేష్, నాయకులు సత్యనారాయణ, బాబ్జి, రామకృష్ణ, విష్ణు, సత్తిబాబు, రాజేష్, బాలాజీ, శివకుమార్, వెంకటేశ్వరరావు, హరి, సత్యవతి పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



అశేష జనవాహినితో యానాం వేంకటేశ్వరస్వామి రథోత్సవం

- వైభవంగా వెంకన్న రథోత్సవం
- హాజరైన అశేష భక్తజనం

యానాం: స్థానికంగా కొలువైన భూ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం వైభవంగా జరిగింది. కళిరెడ్డి సత్య వీర వెంకన్న, కళిరెడ్డి వెంకట కృష్ణయ్య, యర్రా లక్ష్మణరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు సోదరుల ఆధ్వర్యంలో జరిగిన రథయాత్రకు యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్త జనం పోటెత్తారు. స్థానిక చిన్నా సెంటర్ నుంచి ప్రారంభమైన రథయాత్ర పిల్లారాయవీధి, స్టేట్‌బ్యాంక్ జంక్షన్ మీదుగా కొత్త బస్టాండ్ వరకు కొనసాగింది. గోవిందా.. గోవిందా అంటూ భక్తులు స్వామివారి రథాన్ని లాగారు. స్వామివారి రథాన్ని దర్శించేందుకు భక్తులు, మహిళలు బారులు తీరారు. ఆర్ఏఓ మునిస్వామి, డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి వెంకటేశ్వరరావు, వర్తక సంఘ గౌరవ అధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్, ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్సై మురుగానందన్, ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి రూ.లక్ష ఆర్థిక సాయం

అల్లవరం: గ్యాస్ లీక్ కావడంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సంఘటనలో తీవ్ర గాయాల పాలై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న కాట్రేనికోన మండలం దొంతికుర్రు గ్రామానికి చెందిన కొప్పిశెట్టి దుర్గాభవానికి అమలాపురం, ముమ్మిడివరం శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూపు ద్వారా సమకూర్చిన రూ.లక్ష నగదును చెల్లుబోయిన శ్రీనివాసరావు అందించారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో పాటు ఆపదలో ఉన్న వారిని శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ ఆదుకుని వారి జీవితాలకు ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో శెట్టిబలిజ పెద్దలు గొవ్వాల రాజేష్, రెడ్డి శ్రీమన్నారాయణ, గుత్తుల చిరంజీవి, ఇళ్ల శేషగిరిరావు, మట్టపర్తి సురేష్, కాండ్రేగులు త్రిమూర్తులు, కుడుపూడి సామ్రాట్, శ్రీను, దంగేటి రుద్ర, కేతా బానుతేజ, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి




శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

తాళ్లరేవు: ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ–శ్రమ్, పీఎం సూర్యఘర్ తదితర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రతి ఒక్కరూ ఉపయోగించుకునే విధంగా చూడాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో మండల సమాఖ్యలో నిర్వహించిన ఒక్కరోజు లోకోస్ శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వీఓఏలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కార్యాలయం ప్రాంగణంలో మొక్కను నాటారు. కోరంగిలో నిర్వహిస్తున్న వెలుగు మహిళా మార్ట్‌ను సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ ఐబీ జిలాని, డీపీఎం (బ్యాంక్ లింకేజ్) పద్మావతి, డీపీఎం వెంకటేశ్వరరావు, ఏపీఎం బి.విష్ణుమూర్తి, సీసీలు, ఎల్‌సీ మురళి తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా సాగిన క్రికెట్ ఫైనల్

విజేతగా నిలిచిన క్యాడ్ ఎంఎల్ జట్టు



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న కళాశాల చైర్మన్ సతీష్ తదితరులు

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన బీపీఎల్ క్రికెట్ పోటీల్లో క్యాడ్ ఎంఎల్ జట్టు విజేతగా నిలిచింది. గురువారంతో కళాశాలలో క్రికెట్ పోటీలు ముగిశాయని కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు రవి సుధీర్, మురళి తెలిపారు. ఈ పోటీల్లో సివిల్, క్యాడ్ ఎంఎల్ జట్లు ఫైనల్‌కి చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో సివిల్ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన క్యాడ్ ఎంఎల్ జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 7 వికెట్‌లు కోల్పోయి 114 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన సివిల్ జట్టు 14 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 96 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలయ్యింది. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాలల చైర్మన్ బోనం కృష్ణ సతీష్ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు ఈ పోటీలను నిర్వహించామన్నారు. విజేత కు ట్రోఫీ అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జెవీజీ రామారావు, ఏఓ జక్కం కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ మదన్, డిప్లొమా ప్రిన్సిపాల్ ఫణి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై సూచనలివ్వండి

యానాం: ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి సూచనలు ఇవ్వాల్సిందిగా వివిధ రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తున్నట్లు గురువారం డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ తలైవెల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 30లోగా అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి భారత ఎన్నికల సంఘం సూచనలను ఆహ్వానిస్తోందన్నారు.

అల్లవరం ఎస్సైగా తిరుమలరావు



అల్లవరం: అల్లవరం ఎస్సైగా టి. తిరుమలరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం టౌన్ ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై తిరుమలరావుకి పోలీస్ సిబ్బంది స్వాగతం పలికారు. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవం

తాళ్లరేవు: పటవల పంచాయతీ రాఘవేంద్రపురంలో వేంచేసి యున్న కోదండ కల్యాణ రాముని విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవాలలో భాగంగా రెండో రోజు గురువారం విశేష పూజలు నిర్వహించారు. వేద పండితులు పూజ్యం మల్లికార్జున శర్మ నేతృత్వంలో పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం 10.34 నిమిషాలకు కోదండ కల్యాణ రాముని విగ్రహ పునః ప్రతిష్ఠ చేయనున్నారు. అనంతరం యంత్ర స్థాపన, బింబ స్థాపన, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. గోవుకు ప్రథమ దర్శనం కల్పించిన అనంతరం భక్తులకు స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

తాళ్లరేవు: మండల పరిధిలోని జార్జీపేట పంచాయతీ ఎమ్ఎల్‌కే నగర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త శీలి వెంకటేష్ కుటుంబాన్ని గురువారం జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ పరామర్శించారు. కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. వైస్ సర్పంచ్ పేర్ని ఆదినారాయణమూర్తి, పెట్ల సూర్యనారాయణ రాజు, పువ్వల కృష్ణమూర్తి, శీలి రాజు, నగేష్, పువ్వల చినబాబు, డేవిడ్‌రాజు, గోవిందు, పలివెల అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉప్పలగుప్తం: విద్యార్థులు పది పరీక్షలపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని భీమనపల్లి శిరంగు రంగనాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు పాఠశాలలో నృత్యాలు చేసి అలంరించారు. వారికి విద్య నేర్పిన గురువులు, సర్పంచ్ రాజ్‌కుమార్‌ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోపాల్‌నగర్‌లో పేకాట శిబిరంపై దాడి

24 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

యానాం: నియోజకవర్గ పరిధిలోని గోపాల్‌నగర్‌లో నివాస ప్రాంతాల మధ్య జరుగుతున్న పేకాట శిబిరంపై గురువారం ఎస్పీ రాజశేఖరన్ ఆదేశాల మేరకు సీఐ షణ్ముగం ఆధ్వర్యంలో పోలీసులు మెరుపుదాడి నిర్వహించి 24 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. స్థానిక తిరుమల రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో పేకాట రాయుళ్లు గోపాల్‌నగర్ పరిధిలోని మొదటివీధి శ్రీరామ్‌నగర్‌లో గోకవరపు కాశీ విశ్వనాథరావు(బన్నీ) నివాసంలో పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఈ దాడిని నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. వీరిని అరెస్ట్ చేయడంతో పాటు ప్లేయింగ్ కార్డులు, రూ.15,900 నగదుతో పాటు ఇతర ఉపకరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మోటార్ సైకిళ్లు ఢీ: ముగ్గురికి గాయాలు

అమలాపురం రూరల్: రూరల్ మండలం భట్నవిల్లి ఐస్ ఫ్యాక్టరీ సమీపంలో గురువారం సాయత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. రోళ్లపాలెం గ్రామానికి చెందిన నూటికుర్తి లక్ష్మణరావు మోటార్‌సైకిల్ పై అనాతవరం వైపు వెళుతున్నాడు. భట్నవిల్లి ఐస్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చేసరికి భట్నవిల్లికి చెందిన వృద్ధుడు పండు ధనరాజు, రెడ్డి నాగేశ్వరరావులు మరో మోటార్ సైకిల్‌పై మెయిన్ రోడ్డు నుంచి ఐస్ ఫ్యాక్టరీ పక్కన ఉన్న రోడ్డు వైపునకు వెళ్లుతున్నారు. ఈ రెండు మోటారు సైకిళ్లు భట్నవిల్లి ఐస్ ఫ్యాక్టరీ సమీపంలో ఢీకొన్నాయి. దీంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సాయంతో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు తీరని అన్యాయం

అమలాపురం రూరల్: రాష్ట్ర యూనిట్‌గానే ఎస్సీ వర్గీకరణ చేయాలని, జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు తీవ్ర నష్టం జరుగుతుందని రాష్ట్ర ఎంఆర్‌పీఎస్ కన్వీనర్ మోకాటి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని సాకుర్రు జాంబవులుపేటలో జిల్లా మాదిగ పెద్దలు, నాయకులతో గురువారం బాబు జగజ్జీవన్ రామ్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు నాగభూషణం అధ్యక్షతన సమావేశం జరిగింది. నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల వర్గీకరణను అధ్యయనం చేయడానికి నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజించి జిల్లా యూనిట్ గా వర్తింపచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించిందన్నారు. అలా చేస్తే ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లో మాదిగలు తీవ్రంగా నష్టపోతారని అన్నారు.